# విఘ్నరాజ శతకము



రచయిత్రి

చొప్పకట్ల ( దుద్యాల ) హరిణి

+91 98493 81684

# సూచిక

*శతకములోని కొన్ని పద్యములు ముద్గల పురాణమాధారితముగా లిఖించినందున ముద్గల పురాణము గూర్చి క్లుప్తముగా వివరించడం జరిగినది.*

*ముద్గల పురాణం ( సంస్కృతం : मुद्गल पुराणम् ) అనేది హిందూ దేవత గణేశునకు అంకితం చేయబడిన హిందూ మత గ్రంథం. ఇది గణేశునికి సంబంధించిన అనేక కథలు మరియు ఆచార అంశాలను కలిగియున్న ఉపపురాణం.* ***గణేశ పురాణం*** మరియు **ముద్గల పురాణం** *గణపతి భక్తులకు ప్రధాన గ్రంథాలు, వీటిని* ***గానాపత్యులు (గానాపత్యం*** *) అని పిలుస్తారు. ఈ రెండు పురాణాలు మాత్రమే గణేశుడికి అంకితం చేయబడ్డాయి.ఈ గ్రంథములననుసరిస్తూ గణేశ ఉపాసన చేసే వారిని* **గాణాపత్యులు** *అని పిలుస్తారు .*

*ముద్గలుడు అను రాజర్షి ముద్గల పురాణము రచియించినారు. వేదర్షి ముద్గలుడు ప్రస్తుతం పంజాబ్ రాష్ట్రానికి చెందిన పాంచాల రాజ్యానికి చెందిన చంద్రవంశీ/నాగవంశీ క్షత్రియ రాజు భర్మ్యాశ్వుడి కుమారుడు. హిందూమతంలో విశ్వామిత్రుడి తరువాతి రాజర్షులలో ఒకడిగా ఆయనను భావిస్తారు.*

# అంకితం



తే. శతకము లిఖియింపగ నేను సాహసింప
సరసనిలచి శక్తి నిడిన సద్గుణుడగు |
వేల్పునకు కడు ప్రీతితో వినుతి జేసి
అంకితమిడెద శతకమున్ ననుఁగు కొలది! ||

# ఆశీర్వాద పత్రం, కాణిపాకం

Enquiry : 08573-281540
E.O. Office : 08572-281747
Fax : 08573-281747
E.O. : 08573-281960
www.kanipakamvinayaka.org
e-mail : kanipakam_eo@yahoo.com

**"స్వయంభు" శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానము**
**కాణిపాకం, ఐరాల మండలం, చిత్తూరు జిల్లా.**

Ref. :

Date 05/08/2024

To

Harini Dudyala
H.No.744, Block No.C2,
Palam Vihar, Gurgaon-122017

శ్రీమతి దాప్పుకట్లు హరణి గారిచే శ్రీ విఘ్నరాజు పలికించిన "శ్రీ విఘ్నరాజ శతకము" 117 శ్లోకాలతో వినాయకుడు పరమ ప్రీతి పొందునట్లుగా ఉన్నది.

పై విఘ్నరాజ శతకము లోని 103 వ శ్లోకంలో

"బాహుదా తీరమందున బావిలోన
వెలసినావయ్య మముగాయ వేల్పువగుచు
వృద్ధిజూపుచు నిత్యము సిద్ధిలోసగు
వీను మిగులు చరితదేవ విఘ్నరాజ||"

అని శ్రీ కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారి గురించి వర్ణించారు. చాలా బాగుంది. తరువాత 15 వ శ్లోకంలో శ్రీ మహా గణపతి సకల విధ గణములకు, విఘ్నములకు అధిపత్యమును తల్లి తండ్రుల సేవతో సాధించినట్లు చెప్తూ సకల జనులకు మాతాపితరుల సేవతో ఏదైనా సాధించవచ్చు అనే వినాయకుడి ఉపదేశమును తెలియ చెప్పారు.

26 వ శ్లోకములో శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని సేవించిన వారికి సకల కార్యముల జయము కలుగున సమస్త కోరికలు సిద్ధించును అని సకలకష్టములు, దుఃఖములు సంకటహర గణపతిగా పూజిస్తే నశించును అని చెప్పియున్నారు. దీని వలన శ్రీ స్వామి దయ తెలియుచున్నది.

41 వ శ్లోకం లో స్వామికి గరిక అంటే మహా ప్రీతి అని, 67వ శ్లోకం లో సమస్తమైన వ్యాధుల నుండి కాపాడేవాడు వినాయకుడు అనే విషయమును తెలియచేశారు.

77 వ శ్లోకం లో శక్తి కొలది గణపతిని హోమ విధానముతో అర్చిస్తే సకల కష్టములు నశించి సిద్ధి,బుద్ధి కలుగుతాయి అనే సత్యమును ప్రకటించారు.

శ్రీమతి హరణి గారికి వారు రచించిన శ్లోకములలో ఏఏ ఫలితములు చెప్పారో ఆఫలితములన్నియునూ శ్రీ కాణిపాక స్వయంభూ వరసిద్ధి వినాయక స్వామి వారు ప్రసాదించి వారు 67 వ శ్లోకములో కోరుకొన్నట్లు వారికి ఇంకాఅనేక శతకములు రచించే శక్తిని ప్రసాదించాలని కోరిన వరములు సిద్ధింప చేసే వరసిద్ధి వినాయకుడిని ప్రార్థిస్తున్నాను.

5/8/24

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

# ముందు మాట

## "గౌరుమోమువాడ కరుణజూపు"

శ్రీ గణనాథునికి అంకితము చేయబడినవి రెండు పురాణములు ఒకటి "గణేశ పురాణం", రెండు "ముద్గల పురాణం". కవయిత్రి ముద్గల పురాణమాధారముగా ఈ శతకములో చాలా పద్యములు రచించినారు. "శ్రీకర" అంటూ శ్రీ అనేఅక్షరంతో శతక రచన ప్రారంభం చెయ్యడంలోనే కవయిత్రి శ్రీమతి హరిణిగారికి సాహిత్యం పట్లఉన్న అభిలాష, గౌరవము ప్రతిబింబిస్తుంది. "విఘ్నరాజ" అనేమకుటముతో తేనెలొలుకు తేటగీతులలో స్వామివారిని వర్ణించిన విధానము, స్థలపురాణములు, మహిమలు, కోరినకోర్కెలుగాని కవయిత్రికి హైందవ ధర్మముయెడలగల అచంచల విశ్వాసమును, భక్తిశ్రద్ధలను పాఠకునికి తేటతెల్లము చేస్తాయి. అంతేకాకుండా యావత్ భారతదేశములో గణపతి దేవాలయాలు ఎక్కడెక్కడ ఉన్నాయో, వాటిని ఏమని పిలుస్తారో, ఎందుకు ఆ పేరు వచ్చినదో కూడా ఈ శతకములో వ్రాయబడినది. అష్ట వినాయకుల గురించి వ్రాసినారు. మనందరకూ ఎక్కువగా తెలిసిన కాణిపాకం వినాయకుని మొదలిడి, చెన్నై, కేరళ, మహారాష్ట్ర, జైపూర్, ఉత్తరాఖండ్, గ్యాంగ్ టక్, రత్నగిరి మున్నగు ప్రాంతములలో వెలసి అశేషపూజలందుకుంటున్న ప్రథమపూజల స్వామిని మన కనులముందు సాక్షాత్కరించారీ కవయిత్రి. దీని వలన రచయిత్రి ఎంత కష్టపడి ఈ వివరములు సేకరించినారో, ఈ శతక రచనకై వారు ఎంత పరిశోధనసల్పినారోననే ఆశ్చర్యం పాఠకునికి కలగకమానదు. ఈ శతకపఠనమువలన గణనాథుని గురించి మనకు తెలియని ఎన్నోమహిమలు, విశేషములు తెలుస్తాయి. ఈ శతకము తప్పకుండా అందరూ చదివి తరించగలిగినదిగా నేను కోరుకుంటున్నాను. ఈ శతక పఠనము ప్రాంభించి పూర్తిచేసేవరకు పాఠకుడు ఒక అనిర్వచనీయమైన అనుభూతికి లోనవకమానడు. మానసిక ప్రశాంతత కరువైన ప్రతిసారి ఈ శతకపఠనముగావించి శాంతత పొందదగునని నాభావన. స్వామినిగురించి ఎంతో

పరిశోధనచేసి ఎన్నెన్నో విషయములు తెలియచేసిన కవయిత్రిని మనసారా ఆశీర్వదిస్తున్నాను. ముందుముందు ఇంతటి విశ్లేషణాత్మకమైన మరెన్నో పొత్తములు వీరు హైందవ సమాజానికి అందించగల ఆయురారోగ్యములు వీరికి ప్రసాదించగలందులకు స్వామిని ప్రార్థిస్తున్నాను.

ఆ.వె శ్రీకర,శుభకరుడ శితజన పాలక
సిద్ధి బుద్ధి నొసగు శివకుమార!
'హరిణి' నీదుమహిమ నందించ జనులకు
గౌరుమోము వాడ కరుణ జూపు!

ఆ.వె నీదు రూపులవియె నియమానుసారము
ఛందమందు జొనిపి జదువనిచ్చె
హరిహయుడ, గణేశ 'హరిణి'నిఁ బ్రోవగా
గౌరుమోము వాడ కరుణ జూపు!

ఆ.వె జగము దిరిగి దెచ్చి జదువంగ, వెనుకయ్యె
శతక రచనజేసి జక్కగాను
విశ్వ జనుల గాయ ప్రీతితో ప్రార్థించె
గౌరుమోము వాడ కరుణ జూపు!

ఆ.వె చదివి 'హరిణి' రచన సంబరమొందియు
కరుణ జూపగోరె 'కట్టుపల్లి'
నాదు మొరలు వినియు నీదు రక్షనొసగి
గౌరుమోము వాడ కరుణ జూపు!

- శ్రీ ప్రసాద్ కట్టుపల్లి

విశ్రాంత బ్యాంకు అధికారి

# ముందు మాట

## విఘ్నరాయునకు పద్య నైవేద్యం

సనాతన కాలం నుండి పద్యం రాజిల్లుతూనే ఉంది. పద్యమనేది పద్య కవులకు ఒక ధృవపత్రం లాంటిది అని చెప్పవచ్చు. సాధారణంగా పద్యకవులు పుస్తకం అచ్చువేయించాలంటే 108 పద్యాలు అల్లవలసి ఉంటుంది. అప్పుడే అది శతకంగా మారి కవివర్యులకు గౌరవాభిమానాలను తెచ్చి పెడుతుంది. పద్యాలు అల్లాలంటే పద్యానికి సంబంధించిన ఛందోబద్ధమైన పరిజ్ఞానం కొంతైనా తెలిసి ఉండాలి. ఆ ప్రక్రియకు సంబంధించిన నియమ నిబంధనలు పాటించాల్సి వస్తుంది.

ఇక్కడ హరిణిగారు కూడా అదే పనిచేసి, ఇదివరకే "నవ్య కవన సరణి నడచు హరిణి" అను తన మకుటంతో 'ఆ.వె' పద్యాలలో ఒక శతక పుస్తకమును ఆవిష్కరించినారు.

ప్రస్తుతము 'తే.గీ' అను ప్రక్రియలో రెండవ పుస్తకానికి శ్రీకారం చుట్టి, చక్కని తేటగీతులతో శతకాన్ని పూర్తిచేసినారు. దీనిని బట్టి వీరికి తెలుగు పద్య సాహిత్యంపై మంచి పట్టు ఉన్నట్టు తెలుస్తోంది.

"విఘ్నరాజ శతకము" అను ఈ శతకంలో 'విఘ్నరాజ' అను రెండు సూర్య గణాలను మకుటంగా చేసుకొని, పద్య నడకను సాగించినారు.

శ్రీకర శుభకరమగ నీ చిరునగవును

స్మరణ జేయుచు చిత్తాన జాగు లేక

పుణ్య శతకమ్ము లిఖియించి పూర్తి జేయ

విఘ్న ములనెల్ల బాపుమా విఘ్నరాజ! (ప.1) లో

ప్రారంభంలోనే భక్తితో విఘ్నాలు కలుగకుండా విఘ్నేశ్వరుని మాకు శుభము చేకూర్చమని ఎంతో చక్కగా వేడుకుంది.

*భాద్రపద శుద్ధచవితిని బాగుగాను*

*విఘ్న ములకెల్ల నధిపతి వీవెగాన*

*అగ్ర పూజలందు కొనుచునాది దేవ*

*విఘ్న భంజనమును జేయు విఘ్న రాజ! (ప.12)* లో

భాద్రపద మాసంలో వచ్చు వినాయక చవితిన అగ్ర పూజలను అందుకొను ఓయీ! వినాయకా విఘ్నాలకు అధిపతివైన నీవు మా విఘ్నాలను అంతము చేయుమా అంటూ చక్కగా వేడుకొనుట బహు బాగున్నది.

*అక్షయమ్ముగ నిడుమయ్య నాది దేవ*

*శతశతకములను వ్రాయు శక్తి నాకు*

*బుద్ధి సహితము గనిడుచు సిద్ధులన్ని*

*విన్నపములను గొనుమయ్య విఘ్న రాజ! (ప.56)* లో

రెండు శతకాలతో తృప్తి నొందక విఘ్నేశ్వరా! నాకు ఐష్టైశ్వర్యాలు అక్కర్లేదు. శత శతకాలను వ్రాయు శక్తిని ఇమ్మని కవయిత్రి హరిణిగారు ఎంచక్కా కోరుకుంటున్నారో చూడవచ్చు.

*శివుడు ఛేదించినట్టి నీ శిరసు నిలిచె*

*దివ్య కుహరము నందున భవ్యముగను*

*స్వర్ణ కాంతుల భాసుర శక్తి రూప*

*విఘ్న హర్తగ గావుమా విఘ్న రాజ!* (ప.107) లో

అమ్మవారికి కాపలాగ నిలచిన నీ శిరస్సును ఛేదించి, శివయ్య

భవ్యంగా కరిముఖాన్ని చేర్చగా స్వర్ణ కాంతులతో వెలుగొందినావు. శక్తి స్వరూపుడవైన ఓ గణాధిపా! మా విఘ్నాలను హరించి మమ్ము గావుమా ఓ విఘ్నరాజ! అంటూ హరిణి గారు వేడుకోవడం అద్భుతః..

ఇలా ఈ శతకంలో కవయిత్రి హరిణిగారు ఎన్నో పద్యాలతో గణనాయకున్ని భక్తితో స్తుతించడం, వేడుకోవడం చాలా బాగుంది.

ఈ శతకంలోని పద్యాలను పరిశీలించాక కవయిత్రి హరిణి గారి భావనా బలము, కల్పనా చాతుర్యం ఎట్టిదో మనకు బోధపడుతుంది. ఒక కవికి ఉండవలసిన సృజనాశక్తి, మంచి నైపుణ్యం హరిణిగారిలో ఉందని చెప్పవచ్చును.

మునుముందు హరిణిగారి కలం నుండి మరిన్ని మంచి శతకాలు వెలువడి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేయాలని ఆకాంక్షిస్తున్నాను. అలాగే హరిణిగారికి శుభాకాంక్షలు అందిస్తూ.. మనసారా అభినందిస్తున్నాను.



**శ్రీ జక్కని గంగాధర్**

కవి, రచయిత

ముంబాయి

# ఆత్మీయాభినందన

'విఘ్నరాజ శతకము!' చి. సౌ. చొప్పకట్ల (దుద్యాల) హరిణి రచించిన ఈ గ్రంథరాజము, తేనెలూరు తేటగీతి ఛందములో 108 పద్యములతో అలరారుతున్న పద్యశతకం.

ఇద్దరు బిడ్డలకు తల్లిగా, ఒక బాధ్యతగల సాఫ్ట్ వేర్ ఉన్నతోద్యోగియైన శ్రీ శ్రీనివాస శ్రీధర్ గారికి ఉత్తమ ఇల్లాలై, తాను స్వయంగా ఫిజియోథెరపిస్ట్ వృత్తిలో ఉన్న శ్రీమతి హరిణి ఇలా పద్యాలను నేర్చుకుని, ఈ శతకాన్ని కేవలం గణపతి నవరాత్రులలో ఐదు రోజులలో వ్రాయటం నిజంగా నమ్మలేని విషయం. అంతేగాక, మిక్కిలిగా అభినందించవలసిన విషయం కూడా.

ఎందుకంటే, తెలుగు మాతృభాషగా కలిగిన అనేకమంది నేడు, ఆ తెలుగునే తప్పులు లేకుండా చదవటం గానీ, వ్రాయటం గానీ చేయలేకపోతున్నారు. అలాంటిది, నేటి యువతరానికి చెందిన హరిణి తాను పట్టుదలతో ఛందం నేర్చుకుని ఇలా పద్యాలు అల్లటం, అదియును గణాధ్యక్షుడైన శ్రీ విఘ్నేశ్వర స్వామి గురించి ఇన్ని పద్యాలు వ్రాసి, వెలువరించటం ఎంతో మెచ్చుకోదగిన విషయం! వారిని కన్న తల్లిదండ్రులు ధన్యులని చెప్పక తప్పదు. అదే విధంగా ఈ సంస్కృతి, సంప్రదాయం ఆమె కన్నబిడ్డలకు కూడా సంక్రమిస్తుంది.

చిరంజీవి హరిణితో నా పరిచయం చాలా చిత్రంగా జరిగింది. తనకు పద్యరచనలో ఉన్న కొన్ని సందేహాలను తీర్చే వారికోసం ఆమె ఫేస్ బుక్ మాధ్యమంగా వెదుకుతున్న తరుణంలో మా కామన్ ఫ్రెండ్స్ ఎవరో నా పేరు సజెస్ట్ చేయటం జరిగింది. అలా మా పరిచయం జరిగింది.

హరిణి వ్రాసిన ఈ శతకంలోని పద్యాలన్నీ కుసుమ కోమలములు. చక్కని చిక్కని ద్రాక్షాపాకంలాగ ఉంటుంది ఈమె శైలి. చదువుతూ

ఉంటే, హృదయం, శరీరం పులకరించటం తథ్యం. నేను అతిశయోక్తులు చెప్పటం లేదు. పద్యాలు చదవటం ప్రారంభించండి, మీకే ఆ సత్యం అవగతమౌతుంది.

'విఘ్నరాజ' అనే మకుటంతో ఈమె రచించిన ఈ నూటపదహారు పద్యాల పుష్పగుచ్ఛం ఆ కరిముఖుని పాదములకు చక్కని అలంకారమై భాసించింది. ప్రతీ పద్యంలోనూ, పార్వతీనందనుపై ఆమెయొక్క అచంచలమైన భక్తి ఎంతగానో ఇనుమడించింది. ఈమె వ్రాసిన పద్యాలలో గణేశ్వరుని స్తుతించటమే కాదు, అందరి గురించీ వేడుకోవటం కూడా ఎంతో హృద్యంగా అనిపిస్తుంది. ఉదాహరణకు, ఒక పద్యంలో (71) –

తే.గీ. పడిరి క్షోభ కర్షకులెల్ల పలువిధముల

కురియగనకాల వర్షముల్ విరివిగాను |

పూర్ణ సమవృద్ధి నిడుచును పుడమియందు

వితమరిగ నీవు నిలువుమా విఘ్నరాజ ||

అకాలవర్షం చేత పంటలన్నీ పాడైపోగా బహు క్షోభనొందుచున్న కర్షక సోదరులను ఆదుకొమ్మని వినాయకుడిని వేడుకుంటూ వ్రాసిన పద్యం ఇది.

ఈమె శరణాగతి ఎటువంటిదో మచ్చుకు ఈ క్రింది పద్యం ద్వారా తెలుసుకోగలము.

తే.గీ. కింకరినగుచు పదముల కేలబట్టి

జేతు కైంకర్యములు నీకు చిత్తమనుచు |

పద్య నైవేద్యము నిడెద పరవశమున

వీనుమిగులుగ జేయుమా విఘ్నరాజ ||

ఇక గణపతిని ప్రార్థిస్తూ, స్తోత్రం చేస్తూ, శరణాగతి వేడుచూ వ్రాసిన కవయిత్రి 86 వ పద్యం నుంచి 115 వ పద్యం వరకూ భారతదేశంలోని వివిధ గణేశులను మనకు తన పద్యాల ద్వారా పరిచయం చేసారు. నిజానికి అన్ని గణపతి క్షేత్రాలు ఉన్నవని మనకు తెలియని విషయాన్ని హరిణి చక్కగా మనకు తెలిసేలా వివరంగా వ్రాసారు. వీర గణపతి నుండి మహాగణపతి వరకూ చక్కని వర్ణనలతో, మధురమైన భావాలతో గణేశ స్తుతిని పద్యం ద్వారా జరిపారు శ్రీమతి హరిణి. ఇది ఎంతో అభినందనీయమని నా భావన.

ఈ పద్యశతకానికి ముందుమాటను వ్రాయమని హరిణి అడగగానే ఎంతో సంతోషంగా అంగీకరించాను. ఎందుకంటే, నా గురువుయైన శ్రీ కట్టుపల్లి ప్రసాద్ ఆచార్యుల వారితో, వారి శిష్యపరమాణువునైన నేను కూడా ఈ చక్కని పనిలో పాలు పంచుకోవటం నాకెంతో ఇష్టం కనుక. ఈ భాగ్యాన్ని నాకు అనుగ్రహించిన శ్రీమతి హరిణికి సర్వదా కృతజ్ఞురాలిని. కొద్దో గొప్పో వ్రాయగలుగుతున్నా, పద్యరచన చేయగలుగుతున్నా, ఔత్సాహికులకు పద్యశిక్షణ ఇవ్వగలుగుతున్నా అది మా గురువుగారి భిక్షయే.

శ్రీమతి హరిణి మునుముందు మరిన్ని మధురమైన శతకాలను వ్రాయాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను. అదే విధంగా అన్ని రకాల ఛందస్సులలోనూ కృషిచేసి, పద్యకవయిత్రిగా మరింత పేరు తెచ్చుకోవాలని హృదయపూర్వకంగా ఆశీర్వదించుచున్నాను.

ఈ ‘విఘ్నరాజ శతకం’ ఎంతగానో జనాదరణ పొందాలని, కవయిత్రిగా హరిణి మరింత పేరు, ప్రఖ్యాతులు సాధించాలని కోరుకుంటూ, అభినందనలతో…



**శ్రీమతి నండూరి సుందరీ నాగమణి**,

(కథారచయిత్రి, పద్యకవయిత్రి),

విశ్రాంత బ్యాంకు అధికారిణి

## || ఓం శ్రీ విఘ్నరాజాయ నమః ||

మన భారతదేశము అనగా ఈ కర్మభూమి సర్వమంత్ర స్వరూపమై, సర్వవిద్యా సంపత్ప్రదాయకమై ఉండటం, ఇటువంటి మట్టిలో మనం జన్మించటం మన పూర్వజన్మ సుకృతం. అందుకు గానూ మనకు సుకృత, మోక్షాలు లభించే వేద స్మృతులలో ఒకటైన శతకరాజములలో ఒకటి విఘ్నరాజశతకము. ఈ విఘ్నరాజ శతకము రచయిత్రి శ్రీమతి చొప్పకట్ల (దుద్యాల) హరిణి. వీరికి ఈ శతకాలని మీరే ప్రారంభిచాలి అని ఆదేశ, ఆమోద, అనుగ్రహ, గురుకృపతో తటవర్తి గురుకులం వ్యవస్థాపకులు గురువుగారైన శ్రీ తటవర్తి కళ్యాణ చక్రవర్తి వర్యులు ఈమెను ఆశీర్వదించటం ఈమే సౌభాగ్యకరం. లోకకళ్యానార్థం ఈ శతకము అందరినోట ఉచ్చరిస్తూ అందరూ విఘ్నేశ్వరుని ఆశీస్సులు పొందుతూ ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ శతకమును ప్రారంభించి, ఎప్పటికప్పుడు గురువుగారి ఆధ్వర్యములో శతకములో ఉన్న అక్షర, పద, లోపాలను దిద్దుకుంటూ ఈమే ఈ శతకాన్ని పూర్తి చేయడం జరిగింది. అందుచేత ''ఆదౌపూజ్యో గణాధిపః'' అన్నట్టుగా, ప్రతీ శుభకార్యమునకు ప్రారంభములో గణపతి పూజతో పాటు ఇటువంటి శతకములను పఠనం చేస్తూ నేటి తరానికి ఇంకా ఇటువంటి శతకాలను రాసే దిశగా పిల్లలందరిలో స్ఫూర్తిదాయకముగా చొప్పకట్ల (దుద్యాల) హరిణి గారు ఆదర్శనీయంగా నిలుస్తారని ఆకాంక్షిస్తూ.....




### శ్రీ అప్పళ్ళ. సుబ్రహ్మణ్య స్వామి

*యజుర్వేద స్మార్త పురోహితులు*

📞 999 926 5000

న్యూ డిల్లి

# గురు పలుకులు

శివసంకల్పమే సర్వసృష్టి ధ్యానమాత్రంచేత అన్ని సంపదలు ఇవ్వగలిగిన మహాదేవుని కరుణావిలాసానికి అక్షరరూపం కవిత్వం. ఏదో కూర్చుని వ్రాద్దామంటే వచ్చేనా, వద్దని వారించినా ఆగేనా అనిపించే భావాకాశ శబ్దగంగాప్రవాహం కవిత్వం. అందునా అది ఆ సదాశివుని ధ్యానము చేత పునీతమై ఆయనకే అంకితంగా సాగితే అమృతత్వం సిద్ధింపచేస్తుందనేది భక్తజగతికి బుధతతికి విదితమే. అటువంటి భక్తితో నిష్ఠతో మా గురుకులం నుండి శ్రీమతి హరిణి గారు ఈ విఘ్నరాజ శతకాన్ని వ్రాసి యున్నారు.

శ్రీకరముగా మొదలుపెట్టిన ఈ శతకము, మహాగణపతి యొక్క అవతార ఉపాస్య రూప వర్ణనలతో, పురాణగాథాప్రస్తావనలతో అలరారుతూ కవయిత్రి యొక్క స్తోత్రసాహిత్యాధ్యయనమును ప్రతిబింబిస్తూ భక్తియుతంగా మనోజ్ఞంగా సాగింది. సకలదేవతాగణం పరివేష్టించి యుండగా గణపతి కొలువులో తన పద్యరత్నాలను అర్పిస్తానని కవయిత్రి పదహారవ పద్యంలో చెబుతూ మనందరి మనోనేత్రానికి ఆ విఘ్నరాజు యొక్క కొలువుని దర్శింపచేసారు.

శరవణాగ్రజా , పార్వతీ ప్రియనందనా అని 29వ పద్యంలో అనటంతో పాటు కేశవుని మేనల్లుడా అనడంతో 'మేనమామ ముద్దు మేటిముద్దు ' అనే తెలుగు నానుడిని ధ్వనింపచేస్తూ శివకేశవ అభేదాన్ని కూడా అంతర్లీనంగా ప్రకటించారు. "కవన వనమున విరియని కలువ నేను " వంటి కొన్ని ప్రయోగాలు వీరిలోని భావకవితావాణిని వినిపించాయి. 74వ పద్యంలో బ్రతుకు గమనం నేర్పిన సత్యాన్ని ఆవిష్కరించే వేదాంతిగా కనిపిస్తారు కవయిత్రి.

85వ పద్యం నుండి గణపతి యొక్క వివిధ రూపములను వర్ణించిన తీరు ఆ పద్యాల ద్వారా భక్తితో చదివేవారికి ధ్యానయోగాన్ని కలిగించేవిగా ఉన్నాయి.

తేటగీతి పద్యాలలో శతకాన్ని నడిపించిన తీరు భవిష్యత్తులో వీరు మరిన్ని పద్యశతకాలను వెలువరిస్తారని అనిపించేలా ఎంతో హృద్యంగా సాగింది, శ్రీమతి హరిణి గారికి అభినందనలు. అదే విధంగా మా గురుకులం సాంప్రదాయాన్ని అనుసరించి ఈ శతకావిష్కరణ కూడా ఒకానొక పేదవిద్యార్థి చదువుకు పనికివచ్చే సహాయకారిగా జరిపించటం వీరి ధార్మిక చింతనకు తార్కాణం, భగవంతుడు వీరికీ వీరి కుటుంబానికి శ్రేయోభివృద్ధి కలిగించాలని కోరుకుంటున్నాను. పాఠకులు ఈ శతకాన్ని ఆదరించి కవయిత్రి గారి రచనావ్యాసంగానికి ప్రోత్సాహం అందిస్తారని ఆశిస్తున్నాను.



శ్రీరామదాసదాసానుదాసుడు,

**శ్రీ తటవర్తి శ్రీకళ్యాణ చక్రవర్తి**

శ్రీక్రోధి శ్రావణబహుళద్వాదశి
(31/08/2024)

మెల్బోర్న్ ఆస్ట్రేలియా

# కృతజ్ఞతలు

## ఓం గం గణపతయే నమః

## శ్రీ మాత్రే నమః

**ముం**దుగా రాత్రి, పగలు నాకు తోడుగా నిలచి ఈ శతకమును ఊహించని రీతిలో ఐదు రోజులలో పూర్తి చేయించిన ఆ గణనాయకునికి నమః సుమాంజలులు అర్పిస్తున్నాను. నేను అడగగానే ఎంతో ఉత్సాహముతో ముందుమాట వ్రాయడానికి ముందుకు వచ్చి నన్ను ఆశీర్వదించిన శ్రీ కట్టుపల్లి ప్రసాద్ గారికి, శ్రీ జక్కని గంగాధర్ గారికి, శ్రీమతి నండూరి సుందరీ నాగమణి గారికి, శ్రీ అప్పళ్ళ సుబ్రహ్మణ్య శాస్త్రి గారికి, నా హృదయపూర్వక ధన్యవాదములను తెలియజేస్తున్నాను. వీరి పలుకులు నాకెంతో స్ఫూర్తినిచ్చి, ఇంకా మరెన్నో శతకాలు వ్రాయటానికి ఆశీర్వాదములై, నన్ను ముందుకు నడిపించే దివ్యశక్తిగా అనుగ్రహించాలని ఆశిస్తున్నాను. నిరంతరం వారి సహాయము నందించే మా గురువుగారు శ్రీ తటవర్తి కళ్యాణ చక్రవర్తి గారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.





1. శ్రీకర శుభకరమగు నీ చిరునగవును
స్మరణ జేయుచు చిత్తమున్ జాగు లేక |
పుణ్య శతకమ్ము లిఖియించి పూర్తి జేయ
విఘ్నములనెల్ల బాపుమా విఘ్నరాజ ||

2 పత్రి పుష్పముల్ గొనివచ్చి ప్రథమ పూజ
సల్పెద ఘనముగా నీకు శక్తి కొలది |
అండదండల నిడినీవు నన్నాదుకొనుమ
విశ్వగణనీయ దైవమా విఘ్నరాజ ||

3. ఆవిరి కుడుములుండ్రాళ్ళ నక్షయముగ
నర్పణము జేతు ప్రియముగా నాది దేవ |
భక్ష్యభోజ్యముల్ గైకొని భక్త వరద
విజయమునిడి నడుపుమయ్య విఘ్నరాజ ||

4. శుక్ల చవితిని గణపయ్య శుభముగాను
నిన్ను నిలిపెద గృహమున నిరతి తోడ |
నెలుక వాహనా రావయ్య యేలుకొనుమ
విశ్వనాథుని పుత్రుడా విఘ్నరాజ ||

5. పార్వతీ ప్రియ నందన వందనములు
పరమ యోగీశ శివపుత్ర శరణు శరణు |
తొలుత పూజలందుకొనుమ  వెలుగులిడుచు
విద్రవమునిడు దైవమా విఘ్నరాజ ||
(విద్రవము: బుద్ధి)

6. శ్రీకర శుభకర సగుణ శ్రీగణేశ
అభయమిడి మము రక్షించుమమల రూప |
కరుణ కురిపించి దేవరా సిరుల నిడుమ
విశ్వజనులెల్ల వినుతింప విఘ్నరాజ ||

7. నలుగు పిండితో నిను జేసె నగకుమారి
పరవశమ్మైన నినుగాంచ బాలురీతి
అంబ హృదిమెచ్చ నందనా యార్తి దీర్చ
వెజ్జువై మము బ్రోవుమా విఘ్నరాజ ||

8. కవన సుమముల తోడను కాంక్షదీర
సేవ జేసెద నిత్యమ్ము  సిద్ధి నొంద |
పద్యమాలికలర్పించి ప్రణతులిడెద
విద్యల సిరుల నిడుమయ్య విఘ్నరాజ ||

9. మేధ మథనము జేయగా మేలుగాను
భావతామసి తొలుగగా పరవశించి |
పద్యరాశులు వికసించి పరిమళించ
విరుల కైంకర్యమునిడెద విఘ్నరాజ ||

10. నవకమల సుమబాలల నవకము గల
నీ చరణ యుగళమునకు నిరతి తోడ |
ప్రాంజలిడెదను మనసార పరవశమున
విన్నపములెల్ల వినుమయ్య విఘ్నరాజ ||

11. నాగసూత్ర విరాజిత నాదరూప
మూషికాధిప గామివే ముక్తి దాత |
పాప భవచింతనాంతక భక్త వరద
విఘ్నరాజిని దొలగించు విఘ్నరాజ ||

12. భాద్రపద శుద్ధ చవితిని బాగుగాను
విఘ్నములకెల్ల నధిపతి వీవెగాన |
అగ్ర పూజలందుకొనుచు నాది దేవ
విఘ్నరంజన మొనరించు విఘ్నరాజ ||

13. శాంకరీ ప్రియనందన శాంతరూప
శరవణాగ్రజ గణరాజ సర్వరాయ |
నెనరు జూపుము సేవల నేను సలుప
భీతులన్నియు దొలగించు విఘ్నరాజ ||

14. సుగుణ రంజిత భాసుర శోభమూర్తి
దైత్యహారివౌ భీషణ సత్యరూప |
స్కందపూర్వజ కార్యముల్ సరళమవగ
విన్నునువునిడువుము దేవ విఘ్నరాజ ||
(విన్నునువు - నేర్పు)

15. తల్లిదండ్రుల సేవయే ధన్యమనుచు
వారి చరణమ్ములందుండు భూరి పుణ్య |
తీర్థరాజిని స్నానంబు దీర్చినట్టి
విజ్ఞతను మాకునిడుమయ్య విఘ్నరాజ ||

16. సకల దేవగణమ్ములు శాంతముగను
కొలువుదీరిచి నీవుండ కూర్మిదొరగ |
పద్యరత్నాలనర్పింతు ఆద్యసుతుడ
వీనులకు విందు జేయుచు విఘ్నరాజ ||

17. శ్రీమహాదుర్గ యొడిలోన సేదదీరు
బుజ్జి గణపయ్య నీవౌచు పుణ్యమూర్తి |
తల్లి హృదయమునానంద వెల్లిదేల్చు
వినువలను వాడ కైమోడ్పు విఘ్నరాజ ||
(వినువలను - స్వర్గం)

18.ధ్వాంతమంతయు దొలగించి దారి జూపు
స్మరణజేయ నీ నామముల్ సవినయముగ |
నిత్య పూజలు సలుపుచు నిన్ను జేర
విన్నవించెదనార్తితో విఘ్నరాజ ||

19. కామితములెల్ల దీర్చుచు కాణిపాక
వేల్పువై యలరితివిగ వినుత తేజ |
రక్షనిడుచు నిలచినట్టి రమ్య రూప
విజయము నిడుచు గావుమా విఘ్నరాజ ||

20. అతులితంబైన నీపదమందు జేరి
నీవొసంగిన వాక్కుల నిపుణమతిని |
పద్యరత్నాల నల్లితి ప్రమథరాజ
ప్రీతి తోడనర్పింతును  విఘ్నరాజ ||

21. కష్టమనెడాకురాతితో కఠినముగను
సాన బెట్టెద వార్తుల చక్కగాను |
పొంద పరమపథమ్మును యందముగను
వీసరపడక గావుమా విఘ్నరాజ ||

22. విద్యనొసగిన గురునకు వినతి తోడ
ప్రణతులిడి పరమచరిత వ్రాయబూని |
విన్నవించగనార్తితో వెతలుదీర్చ
వెన్నుబట్టి నడుపుమయ్య విఘ్నరాజ॥

23. కింకరినగుచు పదముల కేలబట్టి
జేతు కైంకర్యములు నీకు చిత్తమనుచు |
పద్య నైవేద్యము నిడెద పరవశమున
వీనుమిగులుగ జేయుమా విఘ్నరాజ॥

24. ఐహిక భవబంధనముల మోహమొంది
వ్యర్థమగుచుండ నాజన్మ వ్యస్తమగుచు |
శాశ్వతముగావని తెలిపి సత్యములను
విజ్ఞతనిడుచు గావుమా విఘ్నరాజ ||

25. రేయి పగలునొకటి జేసి హాయి మరచి
ఘంటమును జేత బట్టియున్ గాంచకేమి |
దీక్ష బూనియున్ లిఖియించ దీవెనలిడి
వేల్పుగ నిలచి గనుమయ్య విఘ్నరాజ ||

26. సకల కార్యముల్ సిద్ధించి సఫలమిడను
దుఃఖ సంతాప హేతువులుత్క్రమించ |
సంకటములు హరింపగ సాంత్వమిడగ
విన్నపములు జేసెద నీకు విఘ్నరాజ ||

27. అగణిత గుణగణమ్ములు సుగుణ శీల
గణుతి సేయ శరణమిడి కడమదీర్చు |
వినతులిడగ విశ్వంభర వేల్పువగుచు
వీసరము దొలగగ జేయు విఘ్నరాజ ||
(కడమ -కొఱత, వీసరము - వెలితి )

28. మోదకప్రియ నినుగొల్వ ముదము తోడ
అక్షరమ్ములనిడితివి యక్షయముగ |
తేటగీతియై వెలుగొంద తేనెలొలికి
విపుల కావ్యమై నిలిచును విఘ్నరాజ ||

29. శరవణాగ్రజా పలికెద స్వాగతమ్ము
పార్వతీ నందనా భవ్య ప్రణతులిడుతు |
కేశవుని మేనయల్లుడా దేవ క్లేశనాశ
బిస్తమును దొలగించుము విఘ్నరాజ ||
(బిస్త - దుర్గతి)

30. పుణ్యజనులు నెరిపెదరు పూజ నీకు
యజ్ఞయాగములు సలుపున్ విజ్ఞతతులు |
యత్నమెటుల జేసిన వారి యాశయంబు
వేల్పువైకాచు నిను జేర విఘ్నరాజ ||

31. సంద్రమునుజేర నదులెల్ల సరళ రీతి
పారు నాటంకములుదాటి పరుగులిడుచు |
అట్టిరీతి నినుగనెడి నాశ తోడ
వెడలితిని భక్తపాలకా విఘ్నరాజ ||

32. సంకుచితమౌను గృహములు స్వామి మీకు
భక్తితోవేడగను రమ్ము పరవశమున |
నాదు హృదయ కమలమందు సేద దీర
వినయముగ నుతి సేతును విఘ్నరాజ ||

33. కళల కాణాచివై నీవు కాణిపాక
మందు నలరుచు నిలిచేవు మమత జూపి |
భక్త జనులను బ్రోవుచు భాగ్యమిడను
వెలసినట్టి వేల్పువు నీవు విఘ్నరాజ ||

34. కవన వనమున విరియని కలువ నేను
పద్య శతకమ్ము వ్రాయను పటిమ జూపి |
నీవు జేబట్టి వ్రాయింప నీదు మహిమ
విగమమగును సంకటములు విఘ్నరాజ॥

35. కలియుగంబున కలిమాయ గప్ప మమ్ము
మరచి యద్వైతామృతమును మసలుచుండ |
మిథ్య( విచ్ఛేదనము జేసి మేలునిడుము
విశ్వజనులను రక్షింప విఘ్నరాజ ||

36. సౌఖ్యములిడగ ముదమున సాంత్వమొంది
నీదు స్మరణంబు మరచేము నిష్ఠ వీడి |
భక్తిగా నిను గొలువను పరవశమున
విజ్ఞతనిడి గావుమ దేవ విఘ్నరాజ ||

37. కరుణ లేక వికల్పమీ కవనమనిన
పటిమ లేదనుచు జనులు పలుకులిడిన |
సరసను నిలిచి నడుపుమా సాయమిడుచు
వేల్పుగా నిను దలచగ విఘ్నరాజ ||

38. ప్రేమ యనెడు పాశమ్ములన్ బెట్టి మమ్ము
కష్టములనిండు  కడలిలో గలత( జెంద |
వేడుక వలె గాంచుచు దేవ వింతలన్ని
విస్మరించకు మామమ్ము విఘ్నరాజ ||

39. నామ కీర్తనల్ జేయుచుననుదినమ్ము
దివ్య చరణములనుబట్టి  దేవ సేవ |
సలుప నిరతము వరమిడు సౌమ్య రూప
వేడగానను మన్నించు విఘ్నరాజ ||

40. విశ్రుత చరిత నీదయా విమల రూప
నిరతమును జేయ పఠనమ్ము నెనరు జూపి |
భోగ భాగ్యముల్ తోడను ఫలము నొసగి
విడ్వరములను దొలగించు విఘ్నరాజ ||

41. అల్పమగు గరికను దెచ్చి ఆరజమున
అర్చనమ్మును సలుపగ నాదరించి |
కష్టమంతయు దొలగించి కలిమినిడుమ
వింగడంబగు దైవమా విఘ్నరాజ ||

42. విశ్వ కళ్యాణము కొరకు విలువనిడుచు
భారతమ్మును లిఖియింప భాగ్యమనుచు |
దంతము తునుమాడియు  నేక దంతుడగుచు
విశ్వశోభ గూర్చితివయ్య విఘ్నరాజ ||

43. సర్వలోకార్తి సంహార సామరూప
వేదసారమే నీవయ్య వినుత తేజ |
విశ్వజనులెల్ల వేడగా విశ్వధాత
వెతలు దొలగించి గావుమా విఘ్నరాజ ||

44.  భక్త జనులను బ్రోవుచున్ పలువిధముల
చంటి బిడ్డలవలె నీవు చక్కగాను |
సత్యపథమున నడుపుమా శక్తినిడుచు
ప్రీతితోడను గావుమా విఘ్నరాజ ||

45.  పద్య రచనలు జేయ నే పట్టు జూపి
నీదు విశ్రుత చరితమ్ము నిరతి తోడ |
పఠనమనుదినము సలుప భాగ్యమయ్యె
విశ్వకళ్యాణకారకా  విఘ్నరాజ ||

46.  పద్య శతకమున్ లిఖియించి ప్రస్తుతింప
జనుల మెచ్చుకోలులనెల్ల గనను నేను  |
నీకు ప్రియమైన జాలయా నెనరు జూపి
బిద్దెలన్నియు దొలగించు విఘ్నరాజ ||
(బిద్దె : దుర్గతి)

47. గురుకులమ్మున కవులెల్ల  కూర్మితోడ
కవన కైంకర్యముల్జేయ కరుణ చూపి |
మిత్రులను నీవు బ్రోవుచు మేలు నిడుము
విశ్వవిఖ్యాతి నొందగ విఘ్నరాజ ||

48.  కోటి భానుల తేజమా గోరి నిన్ను
జేర యత్నంబు సలిపెద సేవ జేయ |
నీదు చరణసం సేవయే నాదు రక్ష
విశ్వసించుచు నడచితి  విఘ్నరాజ ||

49. సద్గుణ సదనా శ్రీకరా సౌమ్యరూప
కుంజర వదనా శుభకరా కువల నేత్ర |
మంగళాభరణా దేవ మమ్ముగావు
వేల్పువనుచు కొలువగనే విఘ్నరాజ ||

50. నాగజంధ్య ధారి ప్రణవ నాదరూప
భవ్య విటలాక్షు తనయుడ పాపహారి|
ఋషుల మానస రాజితా ఋతులనిడుమ
పిలుకుమార్చు సంకటములు విఘ్నరాజ ||
(ఋతి=శుభము; పిలుకుమార్చు=నాశనము జేయు)

51. ముదముగ నిను కొలిచెదరు ముజ్జగముల
తొలుత పూజలన్ జేయుచున్ తలతురయ్య |
కార్యసిద్ధి నిడుమయ్య కరుణ జూపి
వేడగా నిను సదయత విఘ్నరాజ ||

52. చారుకేయూర శోభితా చంద్రఫాల
భవభయ పరిహారివి పూజ్య భక్తవరద |
ప్రణతులివె యందు కొనుమయ్య ప్రణవరూప
పీనమునిడుచు బ్రోవుమా విఘ్నరాజ ||
(పీనము = సంతోషము)

53. వెన్నెలై వెలుగంగ నీ విమల రూపు
సేద దీరెదరు జనులు చింత దీరి |
చలువ నిడుచును గావగ శాంత రూప
వెతలుదీరి కొలిచెదము విఘ్నరాజ ||

54. పూని గురువాజ్ఞ మేరకు పుణ్యపథము
బట్టి వ్రాయను శతకమ్ము పయనమైతి |
నీవు చేబట్టి వ్రాయింపనేల చింత
విన్నపములన్ని సిద్ధించె విఘ్నరాజ ||

55. బాలునిగ నీవు నడయాడ ఫాలచంద్ర
ముద్దులొలుకును నీ రూపు ముక్తిదాత |
తల్లిదండ్రుల రాగమా తపనతోడ
విన్నవించగ గావుమా విఘ్నరాజ ||

56. అక్షయమ్ముగ నిడుమయ్య యాది దేవ
శతశతకములను వ్రాయు శక్తి నాకు |
బుద్ధి సహితముగనిడుచు సిద్ధులన్ని
విన్నపములు గైకొనుమయ్య విఘ్నరాజ ||

57. నిదురలోన గాంచితినయ్య నీదు రూపు
ప్రణతులందించుచూ నీకు ప్రమథ రాజ |
భాగ్యశాలినే నిను గాంచి పరవశమున
విస్మరించితి నను నేను విఘ్నరాజ ||

58. యజ్ఞ యాగముల్ హెూమముల్ యనుచు బూని
జేయనేలయ్య గణపయ్య చింతదీర |
నీదు నామమ్ము స్మరియింప నిరతి తోడ
విఘ్నములు నిర్గమించును విఘ్నరాజ ||

59. కల్మషమ్ములు దొలగించి కలత దీర
మర్మ దుర్మతినంతయు మాయజేసి |
బుద్ధినిడుమయ్య జనులకు సిద్ధి తోడ
బిమ్మిటి విడచినరయుమా విఘ్నరాజ ||
(బిమ్మిటి: వివశత)

60. ఆరు రిపువులనణచగ నాప్తుడగుచు
ఇంద్రియముల నియంత్రించనిమ్ము శక్తి |
సలుప నీనామ స్మరణము సతతముగను
విమల సన్నిధి నిడుమయ్య విఘ్నరాజ ||

61. యుగములన్నింటి యందున నిర్మలాత్మ
ధర్మస్థాపనము కొరకు దైత్యహరము |
సలిపి రక్షించినావయ్య జనులనెల్ల
విశ్వజనుల వేలుపువయ్య విఘ్నరాజ ||

62. పద్యములనల్లి జూపను పాటవమును
యత్నమించ దోషమ్ములు ప్రత్యక్షమయ్యె |
తప్పులన్నియున్ సరిదిద్ది ఒప్పునటుల
వెలుగ జేయుమా దయతోడ విఘ్నరాజ ||

63. నీదు నవరాత్రి తిథులలో నిష్ఠ తోడ
పలువిధముల గొలుతునయ్య భక్తి జూపి |
సలుపుచున్ నీదు స్మరణంబు శక్తి కొలది
వేల్పువని కొలచెద నిను విఘ్నరాజ ||

64. ప్రియముగా నిను పార్వతి ప్రేమ సేయ
చిట్టి గారాల పట్టివై సేద దీరు |
కన్న ప్రేమకు తగినట్టి కలిమి గలదె
విబుధతతికిడు మీ బుద్ధి విఘ్నరాజ ||

65. అతిశయంబున గాంచుచు యవని జనులు
పద్యముల నెట్లు లిఖియించె పటిమ లేక |
యనుచు వారెల్ల పలుకగా అఘవినాశ
ప్రేరణము నీవె తెలుపుమా విఘ్నరాజ ||

66. పద్య మొక్కటి వ్రాయను పటిమనిడుము
యనుచు వేడగా దయజూపి యాదరించి |
పద్యధారనే విడువంగ పరమ పురుష
వికట శతకమ్ము వ్రాసితి విఘ్నరాజ ||

(వికట: చక్కనైన)

67. కనని వినని వ్యాధులు కలతనిడుచు
జనుల ప్రాణముల్ హరియింప జాలిలేక |
అట్టి సమయాన గావుమా యాప్తునివలె
బీరమును జూపి రక్షించు విఘ్నరాజ ||

(బీరము : పరాక్రమము)

68. నిండు సభయందు శివుడుండ నీవు వెడలి
జేయ మారాము నొడి జేర చేయిఁజాచి |
విస్మరించుచు గణములన్ భస్మధారి
ప్రేమగ నిను ముద్దాడును విఘ్నరాజ ||

69\. కంజదళ నేత్ర ధవళిత కరుణ రూప
ఏకదంత సగుణరూప యేలు మమ్ము |
శూర్పకర్ణ దయావంత శుభములిడుచు
విశ్వమున శాంతి నిలుపుమా విఘ్నరాజ ||

70\. కవులు వ్రాయననుదినము కావ్యములను
తొలుత నీ పద్యమున్ వ్రాసి తలతురయ్య |
సకల శుభముల నొసగుచు శక్తి నిడుచు
విశ్వకవులను బ్రోవుమా విఘ్నరాజ ||

71\. పడిరి క్షోభ కర్షకులెల్ల పలువిధముల
కురియగనకాల వర్షముల్ విరివిగాను |
పూర్ణ సమవృద్ధి నిడుచుచు పుడమియందు
వితమరిగ నీవు నిలువుమా విఘ్నరాజ ||

72\. హావ భావాల రోబోలు హాయి గొలిపి
క్లిష్ట కార్యముల్ జేయుచు కష్టమనక |
మానవులకన్న నయముగా మరమనుషులు
వింతలెన్నియో జూపిరి విఘ్నరాజ ||

73. భావనంబున నిలుపగా పరవశించి
భక్త జనులను బ్రోచేవు పరివిధముల |
జేయునీ పద్యదీక్షతో చింత దీర్చి
విమలసాన్నిధ్య మిడుమయ్య విఘ్నరాజ ||

74. బ్రతుకు గమనమ్ము నేర్వగా పలుకుచుంటి
నీదు చరణాలె గమ్యంబు నిర్మలాత్మ |
కోరి నిన్ను జేరెదను చకోరము వలె
వేల విధువుల భాసుర విఘ్నరాజ ||

75. సలుపు ప్రతికార్యమున నిల్చి జయకరముగ
విజయ కారకుడగు నీకు వినుతి జేసి |
వ్రాయ బూనితి నీగాధ వక్రతుండ
విజయమునిడి గావుమ దేవ విఘ్నరాజ ||

76. ఫాలనేత్రునిగ వెలసి ఫలమునొసగి
శివుని పుత్రునిగ నిలచి సిద్ధి నిడుచు |
అగ్ర గణనీయ దైవమా ఆర్తిదీర్చి
విశ్వరక్షణ సేయుమా విఘ్నరాజ ||

77. సలుప గణపతి హోమము శక్తి కొలది
సిద్ధి బుద్ధి రిద్ధులతోడ క్షేమమొసగి |
సంకటములను హరియించి సరస నిలచి
విన్నపములెల్ల మన్నించు విఘ్నరాజ ||

78. ఆత్మశుద్ధి లేకయె పూజనాచరించి
కపటతనమున జోడించి కంజములను |
మోక్షమిడుమని వేడేరు మూర్ఖ జనులు
విశద పరుచుము సత్యము  విఘ్నరాజ ||

79. మనసు మందిరముగ జేసి మమత తోడ
నిలిపి నీ దివ్య రూపమున్ నిర్మలముగ |
తలతు నిరతము నిన్నునే తథ్యముగను
విన్నవించుచు నార్తితో విఘ్నరాజ ||

80. చిరునగవుల తోడ జనని(పార్వతి) జేరి నన్ను
నీదు శతకమున్ రచియింప నెనరు జూపి |
మిక్కిలి ప్రశంస లీయగా మీఱు నటుల
విస్మయానందములు గొంటి విఘ్నరాజ ||

81. నీదు చరణ ద్వయంబులన్ నెమ్మి జూపి
మరి మరి తలచి జేరగ మచ్చికాయె |
భానుని కొరకు గాంచెడి పద్మము వలె
వేచియుంటి నీ రాకకై విఘ్నరాజ ||

82. ఆదిదంపతుల్ కొనియాడ ఆది దేవ
స్కంద మూర్తియే పూజించు శాంతమూర్తి |
సకల మంత్రార్థ సారమా సరస నిలచి
వేల్పువై మము గావుమా విఘ్నరాజ ||


83. జీవులన్నింటిలోనను శ్రేష్ఠమైన
మనిషి జన్మంబునిడినావు మమత జూపి |
నీదు స్మరణంబు నిత్యంబు నిరతి తోడ
విస్మరించక సలిపెద విఘ్నరాజ ||

84. సదయత నభయ మిడుమయ్య సగుణ రూప
పార్వతీ ప్రియనందనా పరమపురుష |
చవితి పూజను సలుపగ చక్కగాను
వికసితమగు బుద్ధి నిడుమా విఘ్నరాజ ||

**85.** **తెలియక సలుపు తప్పులు తెఱల నుండి**
**వెడలి నినుజేర మనసాయె విశ్వరాయ |**
**గమనమెటు సలిపిన నీవె గమ్యమనుచు**
**విజ్ఞతనిడితివి దయను విఘ్నరాజ ||**
**(తెఱల: క్షోభ, కలవరము)**

## వీర గణపతి

(స్వర్న / చర్మం, రక్తవర్ణం / ఎరుపు రంగు)
వేతాళశక్తి శరకార్ముక చక్రఖడ్గ
ఖట్వాంగ ముద్గర్ గడాంకుశ నాగపాశం
ధ్వజముద్వహంతం వీరం గణేశమరుణం
సతతం స్మరామి



**86.** **రక్తవర్ణమునందున రాజితముగ**
**రక్షనిడుచు హాయి గొలుపు రమ్యరూప |**
**వీర గణపతిగ నిలిచి వెతలు దీర్చి**
**బిత్తరములాడు దైవమా విఘ్నరాజ ||**
**(బిత్తరము : ప్రకాశించు)**

# హేరంబ గణపతి



## ఆర్ద్ర నక్షత్రం, అతి గౌర వర్ణం / ప్రకాశవంతమైన తెల్లని రంగు


అభయవరద హస్తః పాశ దంటాక్షమాలా సృణి
పరశుదధానో ముద్గరం శోభన: పధకం
చమాతంగ వక్త్రో గణపతిరతిగౌరః పాతు
హేరంభ  నామ.

87. సత్య యుగమున జేయను సత్య ధర్మ
పాలనము వెలుగుచు సింహ వాహనునిగ |
యసుర సంహారమును జేసి యద్భుతముగ
విశ్వరక్షణ నిడినావు విఘ్నరాజ ||

88. పంచముఖముల తోడను పరమపురుష
దివ్య హేరంబ రూపమున్  దీప్తులిడుచు|
సత్త్వగుణతులను జేయగా శౌర్యమూర్తి
వెతలు దీర్చియు గావుమా  విఘ్నరాజ ||
(పీతువు : నేత్రము)

# మయూరేశ్వర గణపతి


*సత్య యుగములో దేవాంతకుడు, నరాంతకుడను అసురల సంహారము కొరకు వెలసిన గణపతి అవతారము*



మయూరేశ్వర్ ఆలయం లేదా మోర్గాన్స్ గణపతికి సంబంధించి ఒక పురాణం ఉంది. భగవాన్ గణేశుడు త్రేతాయుగంలో లేన్యాద్రి గుహలలో జన్మించాడు. వినాయకుడు ఆరు చేతులతో మయూరేశ్వరుని రూపాన్ని ధరించి నెమలిపై విహరించాడు. సింధూరాసురుడిని సంహరించేందుకే స్వామి  ఈ అవతారములో వెలసెను.

**89. వెలయుచున్ మయూరేశ్వర వేల్పుగాను**
**అసుర సంహారమును జేసి యద్భుతముగ |**
**నెమలి వాహనుడవగుచు నెళవునెరిగి**
**భీతిని తొలగించితివయ్య విఘ్నరాజ ||**

# ధూమ్రకేతు



ధూమ్రకేతు అనేది కలియుగం లేదా ప్రస్తుత యుగంలో గణేశుడి అవతారం. ధూమ్రకేతువు అవతారం కల్కికి సమాంతరంగా ఉంటుంది, అంటే అతను కల్కి వంటి పాత్రలను కలిగి ఉంటాడు. అతను మరియు కల్కి కలిసి భూమినుండి దుష్టశక్తులను నిర్మూలిస్తారు. అతను గుర్రపు స్వారీ చేస్తాడు. కలియుగంలో ఉన్న పాపాత్ములను అంతమొందిస్తాడు.

90. ధూమ్రకేతుగా నేతెంచి దుష్టహరము
సలుప కలియుగాంతమ్మున వెలుగులిడుచు |
భస్మధారియై రావయ్య భయముదీర్చ
విష్టపమ్మును రక్షింప విఘ్నరాజ ||
(విష్టపము : లోకము)


## గజానన అవతారము




ఏనుగు ముఖ అవతారం యొక్క మరొక పేరు గజానన. గణేశుడు పార్వతీదేవి శాపం నుండి పుట్టిన దురాశ అనే రాక్షసుడు లోభాసురునితో పోరాడటానికి మరియు దురాశ నుంచి ప్రపంచాన్ని విడిపించడానికి ఈ అవతారాన్ని ఎంచుకున్నాడు.

91. దైత్య భంజన జేయగ ద్వాపరమున
భీషణ గజాననుడవౌచు వెలసి నీవు |
అరుణ వర్ణపు కాంతులఁ కరుణ జూపి
విశ్వ రక్ష నిడితివయ్య విఘ్నరాజ ||

# శ్వేతార్క గణపతి





వరంగల్ జిల్లాలోని కాజిపేటలో భాసిల్లుతున్న
స్వయంభు శ్రీశ్వేతార్క గణపతి

సిద్ధ శ్వేతార్క్ గణపతి భూమిపై అత్యంత స్వచ్ఛమైన మరియు అరుదైన పవిత్ర వస్తువులలో ఒకటి. ఇది నిజానికి గణేశ రూపంలో ఉన్న పొద యొక్క శ్వేతార్క గణపతి శ్వేతార్క్ చెట్టు యొక్క మూలం నుండి వస్తుంది మరియు ఇది గణేశుడి ఆకారంలో ఉంటుంది. దీనిని సంస్కృతంలో "అర్క్" అని అంటారు. శ్వేతార్క్ చెట్టు యొక్క మూలంలో గణేశుడి ఆకారం ఉద్భవించడానికి ఇరవై ఒక్క సంవత్సరాలు పడుతుంది.

**92. దివ్య శ్వేతార్క రూపమున్ దీప్తులిడుచు**
**జ్ఞాన సిద్ధుల నిడుమయ్య ఘనముగాను |**
**వాక్పటిమనిడి జేయుమా పాపహరము**
**విస్ఫుర విశద వేల్పువై విఘ్నరాజ ||**

# వల్లభ గణపతి



పూర్వకాలంలో, వల్లభ అనే స్త్రీ తన దుశ్చర్యల కారణంగా రాక్షసిగా మారుతుందని శపించబడింది. ఏనుగు తల ఉన్న జీవి మాత్రమే ఆమెకు ఈ కష్టాల నుండి ఉపశమనం కలిగించగలదు. ఆమె స్వభావానికి అనుగుణంగా, ఆమె మూడు లోకాలలో విధ్వంసం సృష్టించడం ప్రారంభించింది. ఋషులు, దేవతలు మరియు ఇతర భక్తులు శరణు కోరుతూ శివుని వద్దకు వచ్చారు. వల్లభుడిని ఓడించడానికి స్కందుడిని శివుడు నియమించాడు. వల్లభ భవితవ్యం తెలుసుకున్న స్కంద భగవానుడు ఆమె నుండి పారిపోయినట్లు నటించాడు అతను భగవాన్ గణేశుని వద్దకు వెళ్లి జరిగిన సంఘటనలను వివరించాడు. గణేశుడు కోపంతో వల్లభపై యుద్ధానికి బయలుదేరాడు. శ్రీ గణేశుడిని చూసి, వల్లభ తన శాపం నుండి విముక్తి పొందబోతున్నందున చాలా సంతోషించింది. గణేశుడు వల్లభను తన తొండముతో ఎత్తి తన ఒడిలో పెట్టుకున్నాడు వెంటనే, ఆమె తన క్రూరమైన రూపాన్ని కోల్పోయింది మరియు తన మునుపటి రూపాన్ని పొందింది. గణేశుడు ఆమెను వివాహం చేసుకున్నాడు మరియు "వల్లభ గణపతి" అని పిలువబడ్డాడు.

**93. వల్లభ గణపతిగ నీవు వైభవమున**
**అరుణ వర్ణపు శోభలనలరుచుండ |**
**సేయ నీ ప్రదక్షిణలను సిద్ధినిడుచు**
**విన్నపములను మన్నించు విఘ్నరాజ ||**

## సంతాన గణపతి



**94.  పుత్ర పౌత్రాభివృద్ధికి పూజ సలుప**
**వంశమభివృద్ధి చెందంగ వరములిడుచు**
**సిద్ధి సంతాన గణపతీ శిశువులనిడి |**
**వేల్పువై మము బ్రోవుమా విఘ్నరాజ ||**

## ఋణహర్త్రు గణపతి

**95.  దివ్య ఋణహర్త్రు రూపమున్ దేవ నిన్ను**
**భక్తి తోడను గొలువంగ బాధ దీర్చి |**
**ఋణములన్నియున్ హరియించి ఋద్ధినిడుచు**
**వెతల వలయము దొలగించు విఘ్నరాజ ||**

(* ఋద్ధి : సమృద్ధి*)

## క్షిప్ర గణపతి



గణపతి యొక్క ఈ రూపము భక్తులకు త్వరిత ఫలమును ప్రసాదించి సంతృప్తి పరుస్తుందని నమ్మిక. ఈ రూపములో స్వామి నాలుగు చేతులతో ఎరుపు రంగులో దర్శనమిస్తారు. ప్రధాన కుడిహస్తములో విరిగిన దంతము మరియు ప్రధాన ఎడమ హస్తమునందు కల్పవృక్షము పట్టుకుని ఉంటారు.

**96. క్షిప్రగణపతిగ కొలువ క్షిప్రముగను**
**కార్యసిద్ధుల నిడుతువు కరుణ జూపి |**
**ఆర్తి దీర్చుచు సర్వుల నాదరించు**
**విమల విఖ్యాత చరితుడా విఘ్నరాజ ||**

## ముంబై : నవసాచ గణపతి / సిద్ధి గణపతి



ఈ సిద్ధి వినాయక ఆలయం భారతదేశంలోని మహారాష్ట్రలోని ముంబైలోని ప్రభాదేవి పరిసరాల్లో ఉంది. ఇది 19 నవంబర్ 1801న నిర్మించబడింది. ఈ ఆలయాన్ని కాంట్రాక్టర్ లక్ష్మణ్ విత్తు పాటిల్ నిర్మించారు. ఈ భవనానికి దేవబాయి పాటిల్ అనే ధనిక అగ్ర మహిళ నిధులు సమకూర్చారు. సంతానం లేని దేవబాయి గణేశుడు ఇతర సంతానం లేని స్త్రీలకు పిల్లలను ప్రసాదించాలని

ఆలయాన్ని నిర్మించాడు. హిందూ సన్యాసి అక్కల్‌కోట్ స్వామి సమర్థుని శిష్యుడైన రామకృష్ణ జంభేకర్ మహారాజ్ తన గురువు ఆదేశాల మేరకు ఆలయ ప్రధాన దేవత ముందు రెండు దివ్య విగ్రహాలను పాతిపెట్టాడు. విగ్రహాలను సమాధి చేసిన 21 సంవత్సరాల తరువాత, స్వామి సమర్థ ప్రవచించినట్లుగా దాని కొమ్మలలో స్వయంభూ గణేశుడు ఉన్న ప్రదేశంలో ఒక మందార చెట్టు పెరిగింది.

**97. సమయునే పాపములు లేక సంశయమ్ము
సలుప నీ దర్శనంబును జయము గలుగు |
యభయ మిడు సిద్ధి గణపతి గలరుచుండి
విశ్వమున శాంతి నిలుపుమ విఘ్నరాజ ||**

## పూణే : దగ్డు షేత్ మహారాజ్



దగ్డుషేత్ హల్వాయి గణపతి దేవాలయం పూణేలో ఉన్నది. ఈ ఆలయం 130 సంవత్సరముల పురాతన ఆలయం. శ్రీమంత్ దగ్డుషేత్ హల్వాయి మరియు అతని భార్య లక్ష్మీబాయి తమ ఏకైక కుమారుడిని ప్లేగు మహమ్మారి లో కోల్పోయారు. పూణేలో గణేశ ఆలయాన్ని నిర్మించమని ఒక మహర్షి వారికి చెప్పగా వారు ఈ ఆలయము నిర్మించారు.

**98. స్వర్ణ భూషణ కాంతుల వర్ణమలర
దగ్డుషేతను హల్వాయి తపము రీతి |
ఆలయంబును నిర్మించె నారజముగ
వేల్పుగానిను కొలిచెను విఘ్నరాజ ||**

# కొంకణ్ తీరములో యున్న గణపతి పూలే ఆలయం, రత్నగిరి



స్థానిక జానపద కథల ప్రకారం, హిందూ దేవుడు గణపతి , ఒక స్థానిక మహిళ చేసిన వ్యాఖ్యకు ఉలిక్కిపడి, గులేలోని తన అసలు నివాసం నుండి పూలే కి మారాడు. కాబట్టి ఈ ప్రాంతానికి గణపతిపూలే అని పేరు పెట్టారు. గణపతిపూలే పట్టణం ముంబై నగరానికి దక్షిణంగా, సుమారు 375 కి.మీ.ల దూరంలో ఉంది. ముంబై నగరానికి దక్షిణంగా, కొంకణ్ తీరం వెంబడి దాదాపు 100 ఇళ్ళు ఉన్న ఒక చిన్న పట్టణంలో ఉంది

**99. రత్నగిరియందు నడరుచు రంజితముగ**
**వారుణీ దిశకధిపతివై నిలువగ |**
**భాను కిరణముల్ జేరు నీ పాదములను**
**వినయముగ సేవ జేయను విఘ్నరాజ ||**

# ఉచ్చి పిళ్ళయార్ ఆలయము, తిరుచ్చి



రామ రావణ యుద్ధ అనంతరం రాముడు తన ప్రేమకి చిహ్నముగా విభీషణుడికి విష్ణు స్వరూపమైన రంగనాథ భగవానుడి విగ్రహం ఇచ్చాడు. విభీషణుడు తన రాజ్యానికి వెనుదిరిగి తిరుచ్చిగుండా వెళుతూ కావేరీనదిలో స్నానం చేసి తన దైనందిన కర్మలను చేయాలనుకున్నాడు. విభీషణుడు స్నానం చేస్తున్నప్పుడు దేవతను పట్టుకోవడానికి ఎవరినైనా వెతకడానికి ప్రయత్నిస్తాడు. అతను ఆవుల కాపరి

వేషంలో వినాయకుడిని కనుగొంటాడు. పథకం ప్రకారం, విభీషణుడు పూర్తిగా నీటిలోకి ప్రవేశించినప్పుడు, వినాయకుడు దేవతను తీసుకొని ఇసుకలో, కావేరీ ఒడ్డున ఉంచాడు. ఇది చూసిన కోపంతో విభీషణుడు బాలుడిని శిక్షించేందుకు వెంబడించాడు మరియు బాలుడు పరుగెత్తుకుంటూ కావేరీ ఒడ్డు దగ్గర ఉన్న బండపైకి ఎక్కాడు. విభీషణుడు చివరకు బాలుడిని చేరుకుని అతని నుదిటిపై కొట్టాడు. ఈ రోజు కూడా విగ్రహం నుదుట ఒక నొక్కు కనిపిస్తుంది. చిన్న పిల్లవాడు తనను తాను వినాయకునిగా వెల్లడించాడు. విభీషణుడు వెంటనే క్షమాపణలు కోరతాడు మరియు భగవంతుడు అతనికి తన ఆశీర్వాదం ఇచ్చాడు, ఆ విగ్రహం శ్రీరంగంలో ఉండాలని నిర్ణయించబడిందని మరియు అతనిని లంకకు పంపిస్తాడు.

**100. పూని పల్లవరాజులు ముదము మీర**
**ఆలయంబును నిర్మించిరద్భుతముగ |**
**తిరుచి పిళ్లయార్ ధామమున్ తిరుగులేని**
**వేల్పువై నిలచితివీవు విఘ్నరాజ ||**

## మోతీడుంగ్రి ఆలయము, జైపూర్



మోతీ డుంగ్రీ ఆలయం రాజస్థాన్‌లోని జైపూర్‌లోని మోతీ డుంగ్రీ కొండ మరియు మోతీ డుంగ్రీ కోట దిగువన ఉంది. ఈ ఆలయంలో స్థాపించబడిన గణేశ దేవుని చిహ్నం ఐదు వందల సంవత్సరాల కంటే పాతదని చెబుతారు. ఈ ఆలయమును 1761లో సేఠ్ జై రామ్ పలివాల్ పర్యవేక్షణలో నిర్మించారు.

**101. అద్భుతమగు శిల్పకళలనచ్చముగను**
**స్వర్ణ శోభల రంజిల్లు శక్తి రూప |**
**కొలువ భక్తుల మదియందు కొలువుదీరు**
**బిసరుహదళ నయన దేవ విఘ్నరాజ ||**

# కలమస్సేరి మహాగణపతి ఆలయం,కేరళ



కళమస్సేరి మహాగణపతి క్షేత్రం ఉత్తర కలమస్సేరిలో గణపతికి అంకితం చేయబడిన హిందూ దేవాలయం. ఈ ఆలయాన్ని 1981లో కలమస్సేరి పట్టణంలో నివసించే ప్రముఖ మరియు దైవభక్తి గల దివంగత శ్రీ ఎన్ రేఘునాథ మీనన్ నిర్మించారు.

**102. శార్వరీ శివ శ్రీరామ సహితముగను**
**కేరళమునందు రూఢియై పేరు గాంచి |**
**భక్త జనపాల శుభకరా బాధ దీర్చి**
**వెలుగులిడి నిలచితి వీవు విఘ్నరాజ ||**

# కాణిపాక గణపతి



పురాణాల ప్రకారం, మూగ, చెవిటి మరియు అంధులైన ముగ్గురు సోదరులు ఉన్నారు. తమ పొలానికి నీరు తెచ్చుకునేందుకు బావి తవ్వుతున్నారు. వారు వాడుతున్న పరికరం గట్టిగా తగలడంతో బావిలో పడింది. వారు మరింత తవ్వినప్పుడు, బావిలోనుండి రక్తం కారడం ప్రారంభించింది మరియు ముగ్గురికి వారి వైకల్యాలు తొలగిపోయాయి. గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని వినాయకుడి విగ్రహాన్ని గుర్తించారు. గ్రామస్థులు మరింత తవ్వారు, కానీ వారు

దేవత యొక్క ఆధారాన్ని కనుగొనలేకపోయారు. ఎప్పుడూ నీటితో నిండి ఉండే బావిలో దేవత కూర్చుని ఉంటుంది. ఈ ఆలయం 11వ శతాబ్దం ప్రారంభంలో చోళ చక్రవర్తి కులోత్తుంగ-I చే నిర్మించబడింది మరియు 1336లో విజయనగర చక్రవర్తులచే మరింత విస్తరించబడింది.

**103. బాహుదాతీరమందున బావిలోన**
**వెలసినావయ్య మముగావ వేల్పువగుచు |**
**వృద్ధి జూపుచు నిత్యము సిద్ధులొసగు**
**వీనుమిగులు కథల దేవ విఘ్నరాజ ||**


## వరసిద్ధి వినాయగర్ ఆలయం, చెన్నై



భారతదేశంలోని చెన్నైలోని బీసెంట్ నగర్‌లోని వరసిద్ధి వినాయగర్ దేవాలయం ఒక హిందూ దేవాలయం. ఇది బెసెంట్ నగర్‌లోని బీచ్ సమీపంలో ఉంది.

**104. వరములనొసంగుచునలరు వరదహస్త**
**చెన్నపట్టణమందున చిద్విలాస |**
**మంగళమ్ముల నిడుచుచు మమత జూపు**
**విశ్వమున శాంతి నిలుపుమా విఘ్నరాజ ||**

# గణేష్ టోక్ ఆలయం, గ్యాంగ్ టక్



గ్యాంగ్‌టక్‌లోని అద్భుతమైన బౌద్ధ ఆరామాలలో సిక్కింలోని అనేక చక్కగా నిర్వహించబడుతున్న దేవాలయాలలో ఒకటి, గణేష్ టోక్, ది ఎల్గిన్ నార్-ఖిల్ నుండి 13 కి.మీ దూరంలో ఉంది. 'టోక్' అనే పదానికి సాహిత్యపరమైన అర్థం స్థానిక భాషలో 'ఆలయం' కాబట్టి దీనిని గణేష్ టెంపుల్ అని అనువదిస్తుంది. 1953లో నిర్మించిన విచిత్రమైన మరియు స్పష్టమైన హిందూ దేవాలయం. సందర్శకులకు మంచుతో నిండిన కాంచనజంగా కొండలు మరియు గాంగ్‌టక్ నగరం యొక్క విస్తృత దృశ్యాలను అందిస్తుంది.

**105. విశ్వరక్షణ జేతువు వెలుగులిడుచు**

**వెలసి కాంచనజంగపై వేల్పువగుచు |**

**గిరి శిఖరమున నిలుతువు కెలనుగాను**

**విదుర భూషణా వికసిత విఘ్నరాజ ||**

**(కెలను : అండ,దిక్కు)**

# నరముఖ గణపతి



నరముఖ గణేశ దేవాలయం తమిళనాడులోని తిరువారూర్ జిల్లాలోని కూతనూర్ నుండి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామీణ వాతావరణంలో తిలతర్పన్‌పురి ఆలయ సముదాయంలో ఉంది.

**106. నరముఖునిగ నడరుచుండి నయము గూర్చ**

**కూతనూరున శోభల కొలువు దీరి |**

**సకల శుభములనిడునీకు జయము బలికి**

**పిక్కటిల్లిరి జనులెల్ల విఘ్నరాజ ||**

**(పిక్కటిల్లు: సంతోషము చేత వర్ధిల్లు)**

## పాతాళ భువనేశ్వర్ ఆలయం, ఉత్తరాఖండ్




పురాణాల కథనాల ఆధారంగా శివుడు తన త్రిశూలంతో ఛేదించిన వినాయకుడి తల నేటికీ ఒక ప్రదేశంలో ఉంది.

ఆ రహస్య గుహ ఎక్కడ ఉందంటే

గణేశుడి తలను శివుడు ఉంచిన గుహ ఉత్తరాఖండ్‌లోని పితోరాఘర్‌లో ఉంది. ఈ గుహను పాతాళ భువనేశ్వర్ అని ప్రత్యేకంగా పిలుస్తారు. ఈ రక్షిత గుహ పర్వతం లోపల దాదాపు 90 అడుగుల ఎత్తులో ఉంది. ఈ గుహలోని గణేశుడి విగ్రహాన్ని ఆదిగణేష్ అని పిలుస్తారు. ఈ గుహను క్రీ.శ.1941లో ఆదిశంకరాచార్యులు కనుగొన్నారు. ఈ సంఘటన గురించి స్కాందపురాణంలోని మానస విభాగంలో ప్రస్తావించబడింది. పాతాళ భువనేశ్వర్ ఉత్తరాఖండ్ రాష్ట్రంలో పితోరాగఢ్ జిల్లాలో గంగోలి హాట్ నుండి 14 కి.మీ. దూరములోనున్న గుహ దేవాలయం.

**107. శివుడు ఛేదించినట్టి నీ శిరము నిలిచె**


**దివ్య కుహరమునందున భవ్యముగను |**

**స్వర్ణకాంతుల భాసుర శక్తిరూప**

**విఘ్నహర్తగ గావుమా విఘ్నరాజ ||**

# అష్ట వినాయకులు

## మోరేశ్వర్, మహారాష్ట్ర, మోరెగావ్




మోర్య గోసావి గణేశుని సర్వోన్నత దేవునిగా భావించే హిందూ గణపత్య శాఖకు చెందిన ప్రముఖ సాధువు. మోర్య గోసావి గాణాపత్యుల యొక్క ప్రధాన ఆధ్యాత్మిక మూల పురుషునిగా గణేశుని ప్రసిద్ధ భక్తునిగా పరిగణింపబడ్డారు.

**108. దివ్య కర్హానది దరిని దేవదేవ**
**మోర్య గోసావి కొలువగ ముక్తినిడుచు |**
**మోరెగావునందు వెలుగు ముక్తిదాత**
**వినయముగ నిను గొలిచెద విఘ్నరాజ ||**

## సిద్ధి వినాయక్, సిద్ధటేక్

అహ్మద్ నగర్ జిల్లా లోని ఏకైక అష్ట వినాయక క్షేత్రం సృష్టి ప్రారంభంలో, సృష్టికర్త-దేవుడు బ్రహ్మకమలం నుండి ఉద్భవించాడని, విష్ణువు తన యోగనిద్రలో నిద్రిస్తున్నప్పుడు తన నాభిని పైకి లేపాడని ముద్గల పురాణం వివరిస్తుంది. బ్రహ్మ విశ్వాన్ని సృష్టించడంప్రారంభించినప్పుడు, ఇద్దరు రాక్షసులు మధు మరియు కైటభ విష్ణువు చెవిలోని మురికి నుండి పైకి లేస్తారు. రాక్షసులు బ్రహ్మ సృష్టి ప్రక్రియను భంగపరుస్తారు, తద్వారా విష్ణువును మేల్కొలపడానికి బలవంతం చేస్తారు. విష్ణువు యుద్ధం చేస్తాడు, కానీ వారిని ఓడించలేడు. అందుకుగల కారణాన్ని శివుడిని అడుగుతాడు. పోరాటానికి

ముందు గణేశుడిని - ఆరంభం మరియు అడ్డంకిని తొలగించే దేవుడిని - పిలవడం మరచిపోయినందున తాను విజయం సాధించలేదని శివుడు విష్ణువుకు తెలియజేస్తాడు. అందువల్ల, విష్ణువు సిద్ధతేక్ వద్ద తపస్సు చేస్తాడు, గణేశుడిని తన మంత్రంతో ఆవాహన చేస్తాడు..సంతోషించిన గణేశుడు విష్ణువుకి తన ఆశీర్వాదాలు మరియు వివిధ సిద్ధులను ప్రసాదిస్తాడు, విష్ణువు పోరాటానికి తిరిగి వచ్చి రాక్షసులను సంహరిస్తాడు. విష్ణువు సిద్ధి పొందిన ఈ ప్రదేశాన్ని ఆ తర్వాత సిద్ధతేక్ అని పిలిచేవారు.



**109. విష్ణువే నినుకొనియాడ వెతను దీర్చి**
**సిద్ధులనిడి బ్రోచితివయ్య సిలుగుదొలగ |**
**సిద్ధతేకుగ మారెనీ సిద్ధపురము**
**వేల్పుగ వెలుగులిడ నీవు విఘ్నరాజ ||**

**(సిలుగు: ఉపద్రవము)**

## భల్లాలేశ్వర్, పాలి



పాలి గ్రామంలో వ్యాపారవేత్త కళ్యాణ్, భార్య ఇందుమతిల కుమారుడైన భల్లాల్, తన మిత్రులతో కలసి ఒక పెద్ద రాతిని గణేశుడిగా తలచి చిన్న ఆలయం కట్టి పూజలు చేయుచూ రాత్రి పగలు విస్మరించారు. ఆడుకోవడానికై వెళ్ళిన పిల్లలు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కలత చెందిన తల్లిదండ్రులు కళ్యాణ్ కి ఫిర్యాదు చేయగా, ఆయన వెతుకుతూ వెళ్ళగా

గణేశుడికి పూజలు చేస్తూ చేయిస్తున్న భల్లాల్ ని చూసి అమితమైన క్రోధముతో కళ్యాణ్ తనని ఒక చెట్టుకి కట్టి కొడుతుండగా ఒక సాధువు రూపములో గణేశుడు వచ్చి అతనిని విడిపించగా, భల్లాలుడు ఆ వచ్చినది గణేశుడేనని గ్రహించి పూజించాడు. అప్పుడు ఏదైనా వరము కోరుకోమని అడుగగా నీవు ఎప్పుడూ ఈ ప్రదేశంలో ఉండి నిన్ను ఆశ్రయించే ప్రజల కష్టాలను తొలగించమని భల్లాల్ వేడుకుంటాడు. నా భక్తుడైన నీవు భల్లాల్ ప్రభువు (భల్లాల ఈశ్వరుడిగా) పూజింపబడుతావు అని వరమిచ్చి ఆ సమీపములోనున్న రాతిలోకి అదృశ్యమవుతాడు గణేశుడు. ఆ రాతి విగ్రహాన్ని భల్లాలేశ్వర్ అని అంటారు. కళ్యాణ్ నేలపై విసిరిన రాతి విగ్రహాన్ని ధుండి వినాయకుడు అని పిలుస్తారు.

**110. రాతికి సలుప పూజలు రంజితముగ**
**బాల భల్లాలుడే నీకు భక్తుడగుచు |**
**ప్రీతి జెందగ వేల్పువై ప్రేమ జూపి**
**వెలుగులిడి నిలచితివయ్య విఘ్నరాజ ||**

## వరద వినాయకుడు



గృత్సమద మహర్షి ఋగ్వేదంలోని రెండవ మండలం 43 శ్లోకములలో 36 శ్లోకములు దర్శించిన వారు, అత్యంత ఘనుడు. గృత్సమద మహర్షి మహాతపస్వి.

**111. తపన తోడ గృత్సమదుడు తపము జేయ**
**కరుణ జూపి బ్రోచితివయ్య గౌరితనయ|**
**వరదగణపతిగ నడరు భవ్యరూప**
**విన్నపములెల్ల వినుమయ్య విఘ్నరాజ ||**

# థేవూరు, చింతామణి



థేర్ అనే పేరు సంస్కృత పదం స్థవర్ నుండి ఉద్భవించింది అంటే స్థిరమైనది. ముద్గల పురాణం వివరిస్తుంది: గణ లేదా గుణ లేదా గణాసురుడు రాజు అభిజిత్ మరియు అతని భార్య గుణవతి కుమారుడు. ఒకసారి, గణ మరియు అతని మొత్తం కోరికలు తీర్చే రత్నమైన చింతామణిని కలిగి ఉన్న కపిల ఋషి యొక్క ఆశ్రమానికి చేరుకుంటారు. కపిలముని రత్నం సహాయంతో సృష్టించిన రుచికరమైన ఆహారాన్ని యువరాజు మరియు అతని సైన్యానికి వడ్డిస్తాడు. అత్యాశగల యువరాజు ఆ ఆభరణాన్ని పొందాలని కోరుకుంటాడు, ఋషి నిరాకరిస్తాడు. అయితే, గణ దానిని మహర్షి నుండి స్వాధీనం చేసుకుంటాడు. గణేశుడి భక్తుడైన కపిలుడు రత్నాన్ని తిరిగి పొందడానికి వినాయకుడిని ప్రార్థిస్తాడు. గణ సైన్యాన్ని గణపతి నాశనం చేస్తాడు, అహంకారియైన గణుడి తల నరికివేస్తాడు. గణేశుడు ఆ ఆభరణాన్ని కపిలమునికి తిరిగి ఇస్తాడు, అయితే, ఋషి ఆ ఆభరణానికి బదులుగా తన స్వామిని కలిగి ఉండాలని ఎంచుకున్నాడు. కాబట్టి, గణేశుడు కపిలతో కలిసి థేవూర్‌లో చింతామణి రత్నం పేరు కలిగి ఉంటాడు.

**112. దివ్య థేవూరునందున భవ్యరూప**

**కపిలముని సహితముగను కరుణ జూపి |**

**అబ్ర చింతామణి కలిగి యార్తి దీర్చు**

**విస్ఫురమగు వేల్పువు నీవు విఘ్నరాజ ||**

# గిరిజాత్మజ్ గణపతి, లేన్యాది పర్వతములు



రిజాత్మజ్ అష్టవినాయకుడు - లేన్యాద్రి గణపతి దేవాలయం అష్ట వినాయక తీర్థయాత్రలో సందర్శించే ఆరవ గణేశ దేవాలయం. లేన్యాది పర్వతం మీద ఉన్న 18 బౌద్ధ గుహలలో గిరిజాత్మజ్ గణపతి ఆలయం 8వ గుహలో ఉంది. వినాయకుడిని తన కొడుకుగా చేసుకోవాలనే కోరికతో పార్వతి లేన్యాద్రి గుహలలో 12 సంవత్సరాలు తపస్సు చేసింది. గణపతి సంతోషించి ఆమె కోరుకున్న వరం ఇచ్చాడు. 11వ రోజు అతనికి గణేష్ అని పేరు పెట్టారు అంటే సత్వ, రజ మరియు తమ అనే మూడు గుణాలను అదుపులో ఉంచుకునే వ్యక్తి అని అర్థం.

**113. బౌద్ధ లేన్యాద్రి గుహలందు పరమ పురుష**
**పార్వతి తపమున్ శ్లాఘించి పరవశమున|**
**బాలగిరిజాత్మగ వెలయు భవ్యరూప**
**వేతనలు దీర్చిగావుమా విఘ్నరాజ||**

# విఘ్నహర్ గణపతి, ఓజర్



ముద్గల పురాణం, స్కంద పురాణం ఆధారముగ - అభినందన రాజు ఒక యాగం చేసాడు, అందులో అతను దేవ-రాజు ఇంద్రుడికి నైవేద్యాన్ని ఇవ్వలేదు. కోపోద్రిక్తుడైన ఇంద్రుడు యాగాన్ని నాశనం చేయమని కాలము (సమయం/మరణం)ని ఆదేశించాడు. కాలరాక్షసుడు విఘ్నాసుర లేదా విఘ్నరూపాన్ని తీసుకుంటాడు, అతను యాగంలో అడ్డంకులు సృష్టించి దానిని నాశనం చేశాడు. ఇంకా, అతను విశ్వంలో విధ్వంసం సృష్టిస్తాడు, ఋషులు మరియు ఇతర జీవుల సత్కార్యాలు మరియు యాగాలలో అడ్డంకులు సృష్టించాడు. ఋషులు సహాయం కోసం బ్రహ్మ లేదా శివుడిని అడిగారు, శివుడు గణేశుడిని పూజించమని సలహా ఇచ్చాడు. మునుల ప్రార్థన విన్న గణేశుడు రాక్షసుడితో యుద్ధం చేయడం ప్రారంభించాడు, అతను గణేశునితో గెలవడం అసాధ్యమని గ్రహించి లొంగిపోయి తన పేరున వినాయకుడిని ఆ క్షేత్రమునందు కొలువుదీరమని వేడగా గణపతి అక్కడ విఘ్నహరునిగా కొలువుదీరుతాడు.ఉపశమనం పొందిన ఋషులు ఈ సంఘటనకు గుర్తుగా ఓజర్ వద్ద విఘ్నేశ్వరునిగా వినాయకుని ప్రతిమను ప్రతిష్ఠించారు.

**114. మునులు ఋషులెల్ల వేడగా ఘనము గాను**
**సలిపి విఘ్నాసురుని వధ సిలుగు దీర్చి |**
**విఘ్నహరునిగ రంజిల్లు వేల్పువగుచు**
**విశ్వమున నిలచితివయ్య విఘ్నరాజ ||**

# మహాగణపతి, రంజన్ గావ్



రంజన్గావ్ మహాగణపతి మందిరం అనేది మహారాష్ట్ర, పూణే నగరానికి సమీపంలోని రంజన్గావ్ గ్రామంలో ఉన్న దేవాలయం. గణేశునికి సంబంధించిన అష్టవినాయకుల్లో రంజన్‌గావ్ గణపతి ఒకరు. ఈ ఆలయాన్ని 9వ మరియు 10వ శతాబ్దాల మధ్య నిర్మించారు. ప్రధాన దేవాలయం పేష్వాల కాలంలో నిర్మించినట్లుగా కనిపిస్తుంది. ఈ గణేష్ విగ్రహానికి 'మహెూత్కట్' అని కూడా పేరు పెట్టారు మరియు ఈ విగ్రహానికి 10 తొండములు మరియు 20 చేతులు ఉన్నాయని చెబుతారు

**115. అభయమిడు మహాగణపతిగలరు చుండి**

**దివ్యశక్తి రూపమ్మున దేవ మమ్ము |**

**సంకటమ్ముల బ్రోవుమా సరస నిలచి**

**విశ్వనాథునగ్రసుతుడ విఘ్నరాజ ||**

# కురుడమలై గణపతి, కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా



పురాణాల ప్రకారం ఈ గణేశుడి విగ్రహం నాలుగు యుగాలు, కృత (సత్య) యుగం, త్రేతా యుగం, ద్వాపర యుగం మరియు కలియుగం నుండి భూమిపై ఉంది. ఈ విగ్రహం 12 అడుగుల ఎత్తు మరియు 6-7 అడుగుల వెడల్పుతో సాలిగ్రామ రాతితో తయారు చేయబడింది. సత్యయుగములో త్రిపురాసురుడు అనే రాక్షసుడిని గణేశుడు సంహరించిన తరువాత ఈ గణేశుడి విగ్రహాన్ని త్రిమూర్తులు స్వయంగా ప్రతిష్ఠించారని నమ్ముతారు. ఈ ప్రదేశంలో దేవతలు మరియు దేవతలతో పాటు ఈ మూడు మహా శక్తుల కలయిక 'కూడ మలే'గా లేదా కాలం గడిచేకొద్దీ 'కూటాద్రి'గా సూచించబడింది.

**116. సత్యయుగము నందున జేయ దైత్య హరము**
**బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల్ ప్రతిమ రీతి|**
**నిన్ను నెలకొల్పి జేసిరి నెనరుతోడ**
**వినతులు సవినయమ్ముగ విఘ్నరాజ||**

**117.మంగళము నీకు గణరాజ మంగళములు**
**మంగళము నీకు సురనుత మంగళములు |**
**మంగళము నీకు గణపతి మంగళములు**
**విజయ మంగళములు నీకు విఘ్నరాజ ||**

## గణపతి మంగళహారతి

మంగళ హారతి గైకొనుమా

జయ మంగళ హారతి గైకొనుమా

జయము జయము నీకు జనపాల

జయము జయము నీకు చంద్రఫాల

జయము జయము నీకు మూషికగమన

జయము జయము నీకు పరమపావన || మం||

జయము జయము నీకు పాపహారి

జయము జయము నీకు దైత్యహారి

జయము జయము నీకు వక్రతుండ

జయము జయము నీవె మా అండదండ ||మం||

జయము జయము నీకు సకల విఘ్నహర్త

జయము జయము నీకు సకల శుభకర్త

మంగళహారతి గైకొనుమా

జయ మంగళ హారతి గైకొనుమా.